క్లుప్తంగా

నూతన బస్సు సర్వీస్ ప్రారంభం



పొదలకూరు: నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును మంగళవారం తెల్లవారుజామున బీజేపీ నాయకులు ప్రారంభించారు. పొదలకూరు నుంచి నెల్లూరుకు తెల్లవారుజామున 4.30 గంటలకు బస్సు సర్వీసులను నడపాలని ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని స్థానికులు కోరారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేయించారు. దీనిని బీజేపీ నాయకులు సీహెచ్ చిన సుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు కలిసి ప్రారంభించారు.

మెనూ ప్రకారం భోజనం



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

మనుబోలు: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో భోజన పథకాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వారు పాఠశాలల్లోనే భోజనం చేసేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎంలు శోభన్‌కుమార్, రంగరాజన్ ఉన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు: పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓగా సుధామణి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె సూళ్లూరుపేట నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న .నరసింహారెడ్డి గతేడాది ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిగాలు విధుల్లో ఉన్నారు. సుధామణి సాధారణ బదిలీల్లో భాగంగా రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యూఓగా బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ సంక్షేమాధికారిణిగా పార్వతి బాధ్యతలు చేపట్టారు. ఈమె నెల్లూరు హాస్టల్ నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విద్యుల్లత నెల్లూరుకు బదిలీపై వెళ్లారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోల జారీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని వివిధ సచివాలయాల్లో సమయపాలన పాటించని ఏడుగురు ఉద్యోగులకు మెమోలను ఎంపీడీఓ నారాయణరెడ్డి మంగళవారం జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమయపాలనను సచివాలయ ఉద్యోగులు తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కమనీయం.. కల్యాణ మహోత్సవం



విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమర్పించారు. కల్యాణాన్ని వేదపండితుడు శ్రీకాంత్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు అశేషంగా హాజరయ్యారు. ఉభయకర్తలుగా ఓజిలి కృష్ణారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అన్నప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి (40) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో బర్మాషెల్‌గుంట వైపు వెళ్లే రహదారిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో నవాబుపేట పోలీసులకు రైల్వే అధికారులు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మరణించి పది రోజులై ఉండొచ్చని, పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఉంటారని తెలిపారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతుకు మొండిచేయేనా..?

- అన్నదాత సుఖీభవ ఇచ్చేందుకు ఏర్పాట్లు
- వారి జోలికెళ్లని కూటమి ప్రభుత్వం
- ఐదేళ్ల పాటు రైతు భరోసా ఇచ్చిన నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



కొడవలూరు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం విషయంలో కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. పెట్టుబడి సాయాన్ని రైతులకే అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఈ పథకాన్ని విస్మరించింది. రెండో సంవత్సరంలోనూ రైతులకే అందించేలా చర్యలు చేపడుతున్నా, ఇందులో కౌలు రైతుల ప్రస్తావనే లేదు.

నాడు భరోసా

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులతో సమానంగానే కౌలు రైతులకూ పెట్టుబడి సాయాన్ని అందించింది. కేంద్రమిచ్చే రూ.ఆరు వేలతో రూ.7500ను కలిపి రూ.13500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందించింది. కౌలు రైతులకు నిధులను కేంద్ర ప్రభుత్వమివ్వకపోవడంతో దీన్ని రాష్ట్ర ప్రభుత్వమే అందజేసింది.

హామీ నీటిమూటేనా?

గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీలతో ఊదరగొట్టాయి. తాము అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ వాటా రూ.ఆరు వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలను కలిపి రూ.20 వేలను రైతులతో పాటు కౌలు రైతులకూ అందిస్తామని హామీ ఇచ్చింది. సీసీఆర్ కార్డులు చేయించుకోండి, నగదును జమ చేస్తామని చెప్పడంతో కౌలు రైతులంతా వీటిని పొందారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను ఈ ఏడాది అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితాలను ప్రచురించింది. వీరందరూ ఈ – కేవైసీని చేయించుకోవాలని సూచించింది.

నియోజకవర్గంలో 800 మంది కౌలు రైతులు

కోవూరు నియోజకవర్గంలో 800 మంది కౌలు రైతులున్నారు. వీరందరూ గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కింద నగదు పొందారు. అయితే ప్రస్తుతం కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడంతో పాటు సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో కౌలు రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తావనేదీ..?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకూ రూ.20 వేలను పెట్టుబడి సాయంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో దీని కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే అప్పులు చేసి సాగును ప్రారంభించాం. పెట్టుబడి సాయాన్ని అందిస్తే తీర్చుకోవచ్చని ఆశపడ్డాం. అయితే ప్రభుత్వ వైఖరి చూస్తుంటే అనుమానంగా ఉంది.

– కొండా శ్రీనివాసులురెడ్డి, కౌలు రైతు, నార్తురాజుపాళెం

ఆదుకోవాలి



ధాన్యం ధరలు దయనీయంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పెట్టుబడి సాయాన్ని అందిస్తే కొంత ఊరట లభిస్తుంది. అయితే కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురాలేదు.

– ఉప్పాల జనార్దన్, కౌలు రైతు, నాయుడుపాళెం, కొడవలూరు మండలం

సమాచారం లేదు



అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. ఈ విషయంలో స్పష్టత లేదు.

– విజయలక్ష్మి, ఏఓ, కొడవలూరు

పేద రైతులకు న్యాయం చేయాలంటూ..

- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న తిక్కవరప్పాడు నేతలు, రైతులు

వెంకటాచలం: ఏళ్లుగా వారసత్వంగా భూములు సాగు చేసుకుంటున్న తిక్కవరప్పాడు గ్రామ పేద రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పులయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం తిక్కవరప్పాడు గ్రామ రైతులు ధర్నా నిర్వహించి, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ తిక్కవరప్పాడులో 2187, 2188, 2189, 2190, 2192 సర్వే నంబర్లలో 40 ఎకరాల భూమిలో కొందరు పేద రైతులు వారసత్వంగా సాగు చేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి నెలలో కొందరు నకిలీ పత్రాలు సృష్టించి, నెల్లూరుకు చెందిన నల్లపునేని రమేష్‌కుమార్‌కు విక్రయించి, పేద రైతులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న పేద రైతులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు తలారి దేవదానం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల క్షేత్ర సందర్శన



వరినాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు: మండలంలోని నల్లపాళెం, ప్రభగిరిపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కె.శివనాయక్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకుని తీసుకోవాల్సిందిగా సూచించారు. మండలంలో ఎడగారు వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయని యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ వి.ప్రతాప్ పాల్గొన్నారు.

పశు వైద్యశాలల్లో బదిలీలు



బదిలీ అయిన వారికి సన్మానం

మనుబోలు: మండలంలోని పశు వైద్యశాలల్లో పనిచేస్తున్న పలువురికి స్థాన చలనం కలిగింది. బదిలీపై వెళ్లిన వారిని, కొత్తగా వచ్చిన వారిని మనుబోలు ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీ గురవారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మనుబోలు ప్రాంతీయ వైద్యశాల పరిధిలోని మడమనూరు పశువైద్యశాల వైద్యాధికారిగా డాక్టర్ హర్షకుమార్, గురివిందపూడి ఆర్‌ఎల్‌యూ సెంటర్‌కు సుధాకర్ బదిలీపై వచ్చారు. అలాగే వెంకన్నపాళెం ఆర్‌ఎల్‌యూ సెంటర్‌లో పనిచేస్తుండిన రవి, పిడూరు, మడమనూరు పశువైద్యశాలల్లో వీఏలుగా పనిచేస్తున్న సుందరం, శాంతిని వేరే ప్రాంతాలకు మార్చారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీడీఓ శోభారాణి



మాట్లాడుతున్న డీడీఓ

పొదలకూరు: హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి శోభారాణి తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులై బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకాని వారి వివరాలను తెలుసుకునేందుకు మంగళవారం డీడీఓ స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేస్తామని, టెన్త్ విద్యార్థులు పది మంది ఉన్నా ట్యూటర్లను నియమించడం జరుగుతుందన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలో ఉన్న పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల్లో తల్లికి వందనం పథకం 71 మందికి నగదు జమకాకుంటే పరిశీలించి 64 మంది పేర్లను సరిచేయడం జరిగిందన్నారు. వివిధ రకాల సాంకేతిక కారణాలతో వారికి నగదు జమకాలేదన్నారు. డీడీఓ వెంట ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

మోటార్ల తొలగింపు



ముత్తుకూరు(పొదలకూరు): మండల కేంద్రమైన ముత్తుకూరులో అక్రమంగా వేసిన మంచినీటి బోర్లకు సంబంధించిన మోటార్లను మంగళవారం తహసీల్దార్ స్వప్న విద్యుత్ అధికారులు, సిబ్బంది ద్వారా తొలగించారు. ఇక్కడ బోర్లను అక్రమంగా వేసి ట్యాంకర్ల ద్వారా కృష్ణపట్నం పోర్టుకు నీటిని తరలిస్తున్నట్టు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయడంతో చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాల్లో కొందరు అనుమతి లేకుండా బోర్లను నిర్మించి విద్యుత్ మోటార్లను అమర్చి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ విద్యుత్ అధికారుల ద్వారా విద్యుత్ కనెక్షన్లను తొలగించి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్

- కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు
- థర్డ్ పార్టీ పర్యవేక్షణలో నిర్వహణ



డయాలసిస్ కోసం ఏర్పాటు చేసిన బెడ్స్

పొదలకూరు: పొదలకూరు సీహెచ్‌సీలో ఉచిత డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రజాప్రతినిధులు దీనిని ప్రారంభించారు. వాస్తవానికి అంతకుముందే పనిచేసేది. రోగులు డయాలసిస్ చేయించుకునే వారు. ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం (పీఎంఎన్‌డీపీ) కింద దీనిని ఏర్పాటు చేయడం జరిగింది. థర్డ్ పార్టీ 'రహీ కేర్' పర్యవేక్షణలో ఉంది. సీహెచ్‌సీ రాపూరు, కలువాయి, సైదాపురం, చేజర్ల తదితర మండలాలకు కేంద్ర బిందువుగా ఉంది. దీంతో డయాలసిస్ రోగుల తాకిడి పెరిగింది. ప్రధానంగా మారుమూల పల్లెల నుంచి నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లలేక ఇక్కడకు వస్తున్నారు. మొత్తం 8 బెడ్స్ ఉన్నాయి. రోజుకు 24 మంది వరకు రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు అవకాశం ఉంది. మేనేజర్‌తో పాటు టెక్నీషియన్, అటెండర్, పారిశుద్ధ్య సిబ్బంది మొత్తం ఐదురుగు పనిచేస్తున్నారు. మెడికల్ సామగ్రి, డయాలసిస్‌కు సంబంధించిన కిట్స్‌ను కేంద్రం సమకూర్చుతోంది. నిర్వహణ కోసం థర్డ్ పార్టీని కూడా కేంద్రమే ఏర్పాటు చేస్తూ అందుకయ్యే నిధులను ఇస్తోంది. డయాలసిస్ చేయించుకునే రోగులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో సెషన్‌కు రూ.1,200 చెల్లిస్తుంది. గతనెలలో థర్డ్ పార్టీకి సుమారు రూ.3 లక్షలకు పైగా ప్రభుత్వం బిల్లులను చెల్లించినట్టు అధికారులు వెల్లడించారు. ప్రతి 15 రోజులకొక పర్యాయం కిడ్నీ స్పెషలిస్ట్ వచ్చి పరిశీలించి వెళ్తుంటారు.

ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కిడ్నీల వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో నిపుణులైన వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకుని వారి నుంచి సిఫార్సు చేయించుకోవాలి. సెంటర్‌కు వచ్చి ఇక్కడ ఉన్న మేనేజర్‌కు సిఫార్సు లేఖ చూపించి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అన్నమయ్య జిల్లా రాజంపేట, చిట్వేలి నుంచి కూడా ఇక్కడికి వస్తున్నట్టు సీహెచ్‌సీ అధికారులు వెల్లడించారు.

పేదలకు ఉపయోగం



ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోలేని పేదలకు సీహెచ్‌సీలోని సెంటర్ ఉపయోగపడుతోంది. సీహెచ్‌సీ ప్రాంగణంలోని ఓ భవనాన్ని కేటాయించాం. అయితే తమకు సెంటర్‌పై పర్యవేక్షణ మాత్రమే ఉంది. అజమాయిషీ ఉండదు. థర్డ్ పార్టీ మొత్తం నిర్వహణ బాధ్యతలను చూసుకుంటుంది.

– యు.ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పొదలకూరు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



తోటపల్లిగూడూరు : అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని కోదూరు – 1, కోదూరు – 2 గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ అధిక యూరియా వాడటం వల్ల తాలు గింజలు ఏర్పడటంతోపాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల రసాయనిక ఎరువులకు బదులుగా పచ్చిరొట్ట ఎరువులను వాడితే ఫలితం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నర్సోజీరావు, మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వ్యవసాయ, మత్స్య శాఖ సహాయకులు దయానా, శశి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల పేర్లను అన్ని గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులై ఉండి జాబితాలో తమ పేరు లేకపోతే త్వరలో ఓపెన్ చేయనున్న గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, ఏఈఓ శ్రావణి, వీహెచ్‌ఏ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.
- కొడవలూరు: వరి సాగులో మెళకువలను పాటిస్తే నాణ్యమైన దిగుబడులను పొందొచ్చని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని కమ్మపాళెం, రాచర్లపాడుల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. యూరియా అవసరమైన అన్నదాతలు రైతు సేవా కేంద్రంలో వీఏఏను సంప్రదించాలని కోరారు. ఏఓ విజయలక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు సుజిత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
- విడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి లక్ష్మి కోరారు. మండలంలోని దంపూరు, వావిళ్లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పొలాలను పరిశీలించి ఎరువుల వినియోగంపై సూచనలు చేశారు. సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ భానుప్రసాద్, స్థానిక నేతలు శ్రీధర్ నాయుడు, విజయరాఘవన్, రామ్‌ప్రసాద్, వావిళ్ల సర్పంచ్ శ్రీహరిరెడ్డి, కమతం శ్రీనాథ్, వీఏఏ పవన్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: డేవిస్‌పేటలో..



కొడవలూరు: కమ్మపాళెంలో..



విడవలూరు: వావిళ్లలో..

లారీ బోల్తా : గొర్రెల మృతి

కొడవలూరు: గొర్రెల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పిన ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి నెల్లూరు వైపు వస్తున్న లారీ బోల్తా పడటంతో అందులో ఉన్న నాలుగు గొర్రెలు మృతి చెందాయి. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి మంగళవారం తెలిపారు. పూజల అనంతరం సంగంరోడ్డు సెంటర్‌లో ఉన్న కాకాణి రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సక్రమంగా రేషన్ సరుకుల పంపిణీ



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు: రేషన్ డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆమె డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం సరుకులు అందించాలని ఆదేశించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుల ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీ ప్రదీప్‌కుమార్, సీఎస్ డీటీ సైమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి



మాట్లాడుతున్న స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు: సరుకుల పంపిణీలో పారదర్శకత అవసరమని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌక డిపోల డీలర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. తూకాల్లో వ్యత్యాసాలున్నా, సకాలంలో సరుకులను పంపిణీ చేయకపోయినా సంబంధిత డీలర్‌పై చర్యలు తప్పవన్నారు. రేషన్ షాపులను తాను తరచూ తనిఖీ చేస్తానని తెలిపారు. సమావేశంలో డీటీ సారంగపాణి, ఆర్‌ఐ హైమావతి, డీలర్ల సంఘ అధ్యక్షుడు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.